## క్లుప్తంగా

### నేటినుంచి ఆకాశవాణిలో కొండలరావు ప్రసంగాలు



పొందూరు: ఈ నెల 23, 24, 26, 28వ తేదీల్లో ఉదయం 6.30 గంటలకు చింతన కార్యక్రమంలో వివిధ సామాజిక, ఆధ్యాత్మిక అంశాలపై నామవిజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు వ్యాఖ్యానం ప్రసారమవుతుంది. ఇప్పటికే ఈ అంశాలపై ఆకాశవాణి కేంద్రం స్టేషన్ డైరెక్టర్ ఇందిర పర్యవేక్షణలో డ్యూటీ ఆఫీసర్ తేతలి దిలీప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రికార్డింగ్ జరిగింది. ఈ సందర్భంగా కొండలరావును జిల్లా తెలుగు రచయితల వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణమూర్తి తదితరులు ఆదివారం అభినందించారు.

### ఆహ్వానం..

పొందూరు: ఈ నెల 28, 29వ తేదీల్లో విజయవాడలోని కేబీఎస్ కళాశాలలో 6వ ప్రపంచ తెలుగు రచయిత మహాసభలు నిర్వహించనున్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం జీవితకాల సభ్యుడు, కవి, రచయిత, శ్రీశ్రీ కళావేదిక శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు గ్రహీత, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడు, పొందూరుకు చెందిన వావలపల్లి రాజారావుకు ప్రపంచ తెలుగు రచయితల నుండి ఆహ్వానం అందింది. ఈయన ఎందరో మహానుభావులు అనే వ్యాస సంపుటి, మహోన్నత శిఖరాలు అనే పుస్తకాలను రచించి ప్రచురించారు.

### గ్రామాల్లో ఆధ్యాత్మికత పెరగాలి



ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తున్న వక్తలు

సారవకోట: గ్రామాల్లో ఆధ్యాత్మికత పెరగాలని పలువురు ఆధ్యాత్మిక ప్రవచన కర్తలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బుడితి ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో స్థానిక ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు హిందూ ధర్మ పరిరక్షణ, భగవద్గీత ముఖ్య ఆధ్యాయాలు, రామాయణ, మహాభారతాన్ని ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ల సోమేశ్వరరావు, అల్లు రామయ్య, పట్ట రమణమూర్తి, పొన్నాన సింహాచలం, తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

### వాహనాల తనిఖీ




వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అమీర్ అలీ

కొత్తూరు: మండలంలోని వసప కాలనీ వద్ద ఆదివారం స్థానిక ఎస్ఐ ఎండీ అమీర్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా జరగకుండా అరికట్టడంలో భాగంగా ఒడిశా నుంచి వచ్చిన వాహనాలను పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలులేని వాహన చోదకులు, రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. బైక్‌పై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

### హామీలు నెరవేర్చండి

జలుమూరు: ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఆరు నెలలు కావస్తున్నా.. నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని నరసన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం చల్లవానిపేటలో విలేకర్లతో మాట్లాడారు. సూపర్ సిక్స్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వలంటీర్ వ్యవస్థ కొనసాగింపు, విద్యార్థులకు వారి ఖతాలలో నగదు జమ, ఆడపిల్లలకు నెలకు రూ.1500, విద్యుత్ చార్జిలు పెంచబోమంటూ ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని ఇప్పుడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు.

### ఉచిత శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న సత్యసాయి సమితి సభ్యులు

పాతపట్నం: పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్, అల్లికల్లో భాగంగా మగ్గం, జర్దోసీలో మెలకువలను నేర్పించడం జరుగుతుందని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సత్యసాయి సేవ సమితి మందిరంలో శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆదివారం జిల్లా అధ్యక్షుడు ప్రారంభించారు. స్కిల్ డవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి మహిళలకు మగ్గం, జర్దోసీలో మెలకువలను నేర్పించి, సర్టిఫికెట్లు అందజేశారు. సేవా సమితి మాజీ అధ్యక్షుడు లింగరాజు, మందిరం కన్వీనర్ ఎన్.శ్రీనివాసరావు, కె.వి.రమణ, వై.కృష్ణారావు, చిన్నారావు, సునీత, అప్పారావు, భక్తులు పాల్గొన్నారు.

# పల్లె దరిచేరని ఆర్టీసీ!



పాతపట్నం బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు

- ప్రధాన మార్గాల్లో సర్వీసులతో సరి
- రవాణా సౌకర్యానికి దూరంగా గ్రామీణ ప్రజలు
- పట్టించుకోని అధికారులు



హిరమండలం నుంచి గులుమూరుకు ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

పాతపట్నం, హిరమండలం: వైఎస్సార్ హయాంలో ప్రతీ పల్లెకు ఆర్టీసీ సౌకర్యం ఉండేది. ఆ తరువాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె వెలుగు కాస్తా.. తెలుగు వెలుగుగా మార్చారు. ఆదాయం రాదన్న సాకుచూపి గ్రామీణ ప్రాంతాల సర్వీసులను నిలిపివేశారు. ఫలితంగా ప్రజలు పడుతున్న రవాణా కష్టాలు అన్నీఇన్నీకావు. పాతపట్నం నియోజకవర్గంలో మారుమూల గిరిజన గ్రామాలు అధికం. భౌగోళికంగా అటు ఒడిశా వరకు విస్తరించి ఉంది. ప్రజలు పాలనాపరమైన సేవలకు మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రం పాతపట్నంతోపాటు డివిజన్ కేంద్రమైన టెక్కలికి వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. పాతపట్నం నుంచి టెక్కలికి ఆర్టీసీ సర్వీసులున్నాయి. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట నుంచి డివిజన్ కేంద్రం టెక్కలికి బస్సు సౌకర్యం లేదు.

**ఇదీ పరిస్థితి..**

➡ పాతపట్నం నియోజకవర్గంలో మెళియాపుట్టి మండలంలో అధికంగా గిరిజన గ్రామాలున్నాయి. వీరు మండల కేంద్రానికి చేరుకోవాలంటే అతి కష్టమ్మీద కొండలు దిగి అక్కడ నుంచి ఆటోలపై చేరుకుంటారు. పలాస, టెక్కలి డిపోల నుంచి బస్సు సర్వీసులు తిప్పుతున్నా.. అవి ప్రధాన మార్గాలకే పరిమితం అవుతున్నాయి. టెక్కలి నుంచి మెళియాపుట్టి మీదుగా పెద్దలక్ష్మీపురం వరకు రోజుకు మూడు సర్వీసులు.. పలాస నుంచి పెద్ద పద్మాపురం మీదుగా పాతపట్నానికి రెండు సర్వీసులు తిరుగుతున్నాయి. ఇవి తప్పిస్తే మండలంలో ఆర్టీసీ సేవలు నిల్. మెళియాపుట్టి నుంచి పట్టుపురం, గారబంద మీదుగా గొప్పిలి వరకు సర్వీసు నడపాలన్న ప్రతిపాదన ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. ఈ మార్గంలో ప్రైవేటు బస్సులు పదుల సంఖ్యలో ఉన్నాయి.

➡ గతంలో పాతపట్నం నుంచి పర్లాకిమిడి మీదుగా రొంపివలసకు ఆర్టీసీ సేవలు ఉండేవి. ఇప్పుడు రొంపివలస సర్వీసు నిలిపివేశారు. పాతపట్నం మండలానికి సంబంధించి గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే శరణ్యంగా మారుతున్నాయి. మారుమూల రొంపివలస, రొమదల వెళ్లాలంటే పర్లాకిమిడి నుంచి ఆటోలను ఆశ్రయిస్తుంటారు. సీది వంటి ప్రాంతాలకు పరిమిత సర్వీసులు తిప్పుతున్నారు. మండలంలో దాదాపు అన్ని ప్రాంతాలకు పక్కా రహదారులున్నాయి.

➡ కొత్తూరు మండలానికి సంబంధించి శ్రీకాకుళం నుంచి బత్తిలి, అటు పాలకొండ నుంచి కొత్తూరు, హడ్డుబంగి నుంచి కొత్తూరు సర్వీసులు మాత్రమే తిరుగుతున్నాయి. మారుమూల పల్లెలకు మాత్రం ఆటోలే దిక్కు. గ్రామాల నుంచి ఆటోలకు రావడం

➡ హిరమండలం మండలానికి సంబంధించి వంశధార రిజర్వాయర్ నిర్మాణంతో ఆరు పంచాయతీల్లోని గ్రామాలు వేర్వేరు ప్రాంతాలకు మారిపోయాయి. గులుమూరు, దుర్బలాపురం వంటి మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సదుపాయం లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. హిరమండలం నుంచి పాతపట్నం వరకు ప్రత్యేక సర్వీసులు తిప్పితే రవాణా కష్టాలు తీరుతాయి.

➡ ఎల్.ఎన్.పేట మండలానికి సంబంధించి ప్రధాన రహదారికే ఆర్టీసీ సర్వీసులు పరిమితమయ్యాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పక్కా రహదారులున్నచోట ఆర్టీసీ సర్వీసులు నడపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రైవేటు వాహనాలే దిక్కు



ఆర్టీసీ సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. వారు అడిగినంతగా ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రయాణికులు లేకపోతే గంటల తరబడి వేచి ఉండాలి. పని మీద మండల కేంద్రానికి వెళ్లే రవాణా సౌకర్యం లేక సకాలంలో ఇంటికి చేరలేం. సమయం వృథా అవుతోంది.

– కరణం శివరాం, ప్రయాణికుడు, పింద్రువాడ, హిరమండలం మండలం

### రోడ్డు ఉన్నా బస్సు రావడం లేదు



గతంలో రొంపివసలకు బస్సు ఉండేది. రహదారి బాగులేదని ఆర్టీసీ సర్వీస్‌ను నిలిపివేశారు. రహదారిని బాగుచేసినప్పటికీ ఆర్టీసీ బస్సు రావడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ సర్వీస్ తిప్పాలి.

– సురవరపు రామారావు, ప్రయాణికుడు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం మండలం

### పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు



ఇటీవల కురిసిన వర్షాలకు సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షంనీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో నీరు నిలిచిపోవడంతోపాటు ఆవరణంతా బురదమయంగా తయారవుతుంది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా.. పరిష్కారం కావడంలేదని విద్యార్థులు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పాఠశాల ఆవరణాన్ని బాగు చేసేందుకు ప్రయత్నం చేసినా అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చకపోవడంతో పనులు అంతంత మాత్రంగా జరిపి నిలుపుదల చేశారు. ఏ మాత్రం వర్షం కురిసినా పాఠశాల ఆవరణ బురదమయంగా తయారై నడవడానికి వీలు లేకుండా పోతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సారవకోట

## బాడీ బిల్డింగ్ పోటీల్లో మెరిసిన కంబకాయ కుర్రోడు

- జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకం కైవసం



సతీష్

నరసన్నపేట: మండలంలోని కంబకాయకు చెందిన పాగోటి సతీష్ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ (మిస్టర్ ఇండియా) అండర్ 23 (జూనియర్ కేటగిరి–60 కేజీలు) విభాగంలో సత్తా చాటాడు. బంగారు పతకం కైవసం చేసుకుని శ్రీకాకుళం జిల్లాతోపాటు స్వగ్రామం కంబకాయ ఖ్యాతిని ఇనుమడింపజేశాడు. ఈ నెల 20, 21వ తేదీల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర న్యూ కోచ్ బెహర్‌లో 22వ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఇండియన్ ఒలంపిక్ సంఘంతో గుర్తించిన ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో బంగారు పతకం పొందడం ఆనందంగా ఉందని సతీష్ అన్నారు. ప్రత్యేకంగా నరసన్నపేటలో జిమ్‌తోపాటు విశాఖలోని రామ్ ఫిట్‌నెస్ 360 జిమ్‌లో కోచింగ్ తీసుకున్నాన్నారు. సోమేష్, చిరంజీవి, రాము కోచ్‌లుగా వ్యవహరించారన్నారు. సతీష్ బంగారు పతకం పొందడం పట్ల మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి, గ్రామస్తులు పాగోటి భరద్వాజ్, సతీష్ తండ్రి వెంకటరావు, తదితరులు అభినందించారు.

## మాజీ సైనికుల కుటుంబాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు అవతారం

ఆమదాలవలస: నియోజకవర్గంలో గల మాజీ సైనికుల కుటుంబాల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి తమవంతు కృషిచేస్తున్నామని మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర అవతారం అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ కార్యాలయంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. మాజీ సైనికులకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. త్వరలోనే కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నామని వెల్లడించారు. ఎక్స్ సర్వీస్‌మన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.శంకరరావు, బర్రి సంజీవరావు, జి.సత్యనారాయణ, తాండ్ర జనార్దనరావు, బి.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రాము, జి.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..



పాతపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద కోవిడ్ సమయంలో ఉపయోగించే వాహనం ప్రస్తుతం తుప్పు పట్టింది. కరోనా రోగులను జెమ్స్, రిమ్స్‌కు, కోవిడ్ కేంద్రాలకు తరలించేందుకు మండలానికి ఒక వాహనాన్ని ఆరోగ్యశాఖ వారు గత ప్రభుత్వంలో కేటాయించారు. కోవిడ్ అనంతరం ఆ వాహనాన్ని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉంచడంతో వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపట్టి పనికిరాకుండా పోతుంది. దీనిపై తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా గతంలో ఉన్న తహసీల్దార్ ఈ వాహనంపై ఆరోగ్యశాఖ అధికారులకు తెలిజేశారన్నారు. మరోసారి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

– పాతపట్నం

### పనిచేయని ఫీడర్ అంబులెన్స్



ఈ చిత్రం మెళియాపుట్టి మండలంలోని కరజాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిలిపివేసిన ఫీడర్ అంబులెన్స్. గిరిజన ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో రోగులు, గర్భిణులను ఆస్పత్రికి తరలించడానికి ఉపయోగపడే ఫీడర్ అంబులెన్స్ మరమ్మతులకు గురై మూలకు చేరింది. ఆరోగ్య కేంద్రం పరిధిలోని పరశురాంపురం, భరణికోట, కోళిగాం గ్రామ పంచాయతీల్లోని గిరిజనులకు అత్యవసర వైద్యసేవలు అందించడానికి దీని ద్వారా తరలించేవారు. దీనిపై ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) సింహాచలంను వివరణ కోరగా.. నెల రోజులుగా ఫీడర్ అంబులెన్స్ పనిచేయడం లేదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

– మెళియాపుట్టి


### తాగునీరు వృథా..



కొత్తూరు మండలంలోని వసప గ్రామం సమీపంలోని వంశధార నది నుంచి పలు గ్రామాలకు తాగునీరు అందిస్తున్న మెగా పైపులైన్ మహర్తాపురం కాలనీ సమీపంలో లీక్ అయింది. ఆ ప్రాంతమంతా నీటితో నిండింది. నెలల తరబడి పైపులైన్ లీక్ కావడంతో నీరు వృథాగా అవుతోంది. తాగునీరు లీక్ కావడం వలన కలుషితం అవుతుంది. కొత్తూరు, సీతంపేట మండలాల ప్రజలు తాగునీరుగా వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీక్‌ను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

– కొత్తూరు

### అల్లుకున్న నిర్లక్ష్యం



ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంతో ఉన్న విద్యుత్ స్తంభంపైకి పాదులు అల్లుకున్నాయి. స్తంభం చివరి వరకు పాదుల అల్లుకున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి పాదులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

# రైతుకు కష్టమే మిగిలింది



పొందూరు: కింతలిలో ధాన్యానికి మొలకలు వచ్చాయని చూపిస్తున్న రైతు



నరసన్నపేట: మాకివలసలో తడిసిన వరి ఎన్నులను చూపుతున్న సర్పంచ్ మోహన్‌రావు

ఎల్.ఎన్.పేట/నరసన్నపేట/పొందూరు: తుఫాన్ ప్రభావంతో నాలుగురోజులు పాటు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. శనివారం సాయంత్రం నుంచి వర్షం కురవటం తగ్గింది. వర్షం తగ్గినప్పటికీ ఆదివారం నాటికి పొలాల్లో వరదనీరు నిలిచి ఉంది. పొలాల్లో నీరు నిలిచి ఉండటంతో పంటకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అపరాల పంటలైన మినుము, పెసరతోపాటు రబీ వరి, మొక్కజొన్న పంట పొలాల్లో వర్షం నీరు నిలిచి ఉంది. పలుచోట్ల ధాన్యం రాశులు తడిసిపోయాయి. పంట పొలాల్లో వరి పనలు తడిసి ధాన్యం మొలకలెత్తాయి. పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎల్.ఎన్.పేట: బొత్తాడసింగి ప్రాంతంలో వరి చేను కుప్పలు ఉన్న పొలంలో నిలిచి ఉన్న నీరు



ఎల్.ఎన్.పేట: మిరియాపల్లి వద్ద మొక్కజొన్న పొలంలో నిలిచి ఉన్న వర్షం నీరు



ఎల్.ఎన్.పేట: వాడవలస వద్ద అపరాల పంట పొలాల్లో నిలిచిన వరదనీరు

### నీలమణిదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.



సర్టిఫికెట్, మెమెంటో అందుకుంటున్న చాణుక్యనాయుడు

### ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జలుమరు: మండలంలోని లింగాలవలస ఉన్నత పాఠశాలలో గణిత మేధావి రామానుజన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్ఎం ఉంగటి అప్పలసూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో గణితం ఎంతో కీలకమన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బమ్మిడి శ్రీనివాసరావు, జల్లు రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు వర్తించవా..!



ప్రధాన రోడ్డులో సరుకులతో ఉన్న లారీని తప్పించబోయి ఇరుక్కున్న ఆర్టీసీ బస్సు

ఆమదాలవలస: అసలే ఇరుకు రోడ్లు.. రోడ్లపైనే తోపుడు బండ్లు.. వీటికి చాలదన్నట్టుగా ఆమదాలవలసకు చెందిన కొంతమంది వ్యాపారులు నిత్యం తమ గోదాంలకు వచ్చే సరుకుల లారీలను రోడ్డుపై పెట్టి అన్‌లోడ్ చేస్తూ ఉంటారు. బస్సు వచ్చినా.. కారు వచ్చినా తోవ ఇచ్చే పరిస్థితి లేదు. ప్రతీ ఆదివారం లోగుట్టున టాక్స్ చెల్లించకుండా సరుకులు తెచ్చి నిల్వ చేస్తూ ఉంటారు. అందులో భాగంగా ఈ ఆదివారం మధ్యాహ్నం కూడా సరుకులతో వచ్చిన లారీని ఓ వ్యాపారి ఆమదాలవలస పట్టణంలోని ప్రధాన రోడ్డుపైనే గంటల సమయం ఉంచి అన్‌లోడ్ చేశారు. బస్సులు, వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉన్నా.. ఇరికించి, ఇరికించి వెళ్లాలని హుకుం జారీ చేశారు. లారీని తప్పించిబోయిన ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొట్టింది. 20 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిచింది. బస్సును తప్పించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కొంతమంది స్థానికులు, ప్రయాణికులు ఫొటోలు తీస్తుంటే సదరు వ్యాపారి ఏమవుతుందంటూ ఎదురు ప్రశ్న వేయడమే కాకుండా.. తనకు పోలీసులు, రాజకీయ నాయకులు తెలుసంటూ దబాయించడం కొసమెరుపు. ట్రాఫిక్‌లేని సమయంలోనూ, రాత్రి సమయాల్లోనూ అన్‌లోడ్ చేయకుండా.. పగటిపూట రోడ్డుపై లారీలు నిలబెట్టి సరుకులు అన్‌లోడ్ చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడమే ఎందుకు కారణమని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

### గణిత పరీక్షలో ప్రతిభ

హిరమండలం: సిక్కోలు గణిత వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షల్లో హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి యందవ చాణుక్యనాయుడు ప్రథమ స్థానం సాధించాడని హెచ్ఎం తులగాపు కేశవరావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, డీఈఓ ఎస్.తిరుమల చైతన్య చేతులమీదుగా చాణుక్యనాయుడుకు మెమొంటో, సర్టిఫికెట్‌ను అందజేశారు. చాణుక్యనాయుడును ప్రసాద్ చక్రపాణి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.